ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

సోమవారం 31 మార్చి 2025





7

కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న **వ్యాపారస్థులు**

● రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం ● రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు ● రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశాలు

శ్రీవిశ్వావసుకు ఘన స్వాగతం



పండితులను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

● దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
● కలెక్టరేట్‌లో పంచాంగ శ్రవణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉగాది పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా అంతటా జరుపుకున్నారు. మామిడి తోరణాలతో ఇళ్లను అలంకరించి.. సంప్రదాయ వస్త్రధారణతో చిన్న.. పెద్ద ఆకట్టుకున్నారు. షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడిని రుచి చూశారు. ఇష్టదైవాన్ని దర్శించుకుని పూజలు చేశారు. కొత్త ఆశలు.. ఆశయాలతో షడ్రుచుల సమ్మేళనాలతో మార్పును స్వాగతిస్తూ విశ్వావసును జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. ఏఏ రాశులవారికి ఏఏ ఫలితాలు కలుగనున్నాయి. వర్షాలు.. పాడి పంటలు.. శుభకార్యాలు.. మంచి ముహూర్తాలు ఎప్పుడెప్పుడు ఉన్నాయి. ఇత్యాది అంశాలను పంచాగం ద్వారా పండితులు తెలియజేశారు. దేవాలయాల్లో భక్తులు పత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యాక్రమాలను నిర్వహించారు.

కలెక్టరేట్‌లో సాంస్కృతిక, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాగ శ్రవణం జరిగింది. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని, వ్యవసాయంలో దిగుబడులు బాగా వస్తాయని పండితులు తెలిపారు. పంటలకు ప్రసిద్ధి అయిన పల్నాడు జిల్లాలో మిర్చి, కందులు, జొన్నలు పంటలు బాగా పండుతాయని చెప్పారు. జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని.. మెడికల్, ఇంజనీరింగ్, ఐసెట్, లాసెట్ వంటి ఉన్నత విద్య ఎంట్రెన్స్ టెస్టుల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. మహిళల మాటకు విలువ, రాజకీయ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కుతాయన్నారు. వ్యాపారాలు బాగా జరిగినా ఆశించిన స్థాయిలో లాభాలు చూడకపోవచ్చన్నారు.

ప్రగతికి ప్రణాళికతో ముందుకు సాగుదాం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం అందరికీ సకల శుభాలు కలుగజేయాలని సభలో వక్తలు ఆకాంక్షించారు. సంప్రదాయాలను అందరూ కాపాడుకోవాలన్నారు. జిల్లా ప్రగతి కోసం ప్రణాళికతో ముందుకు సాగుదాం అని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలందరూ రానున్న సంవత్సర కాలంలో ఎదుగుదలకు ఒక ప్రణాళిక రచించుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి పాటు పడదాం

కలెక్టర్ పీ అరుణ్ బాబు

ఉగాది సందర్భంగా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి పాటుపడదామని కలెక్టర్ పీ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున ప్రారంభించిన పీ-4 కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వారు పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. పారిశ్రామిక వేత్తలు పేదల కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవితాలను మెరుగుపరిచేందుకు సహకారం అందించాలన్నారు. ఈ విశ్వావసు నామ ఉగాది సంవత్సరం అన్ని వర్గాల వారికి చక్కని ఫలితాలనిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ధనిక వర్గాలు పేదల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలోని చెడుని వదిలేసి మంచి మార్గంలో ముందుకు సాగాలని కోరారు. జీవితం మొత్తం ఆనందంగా ఎవరికీ ఉండదని.. కష్ట, నష్టాలను తట్టుకుని నిలబడటం అలవర్చుకోవాలన్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో కృషి చేసిన 16 మంది ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుం జయ్ గనోరే, డీఆర్వో మురళీ, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.



పంచాంగం పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ డీఆర్వో మురళీ, ఆర్డీవో మధులత

నేడు రంజాన్



● మసీదులు ముస్తాబు
● ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు
● ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు

నరసరావుపేట మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నెలవంక దర్శనంతో ముస్లింలు ఉపవాసాలు విరమించి సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. పండుగ పురస్కరించుకుని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద షామియానాలను ఏర్పాటు చేశారు. తాగునీటి వసతిని కల్పించారు. ఈద్గా ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది ప్రార్థనలకు హాజరవుతుండటంతో ఈద్గాల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుంది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. నరస రావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, చిలకలూ రిపేట, సత్తెనపల్లి, గురజాల, దాచేపల్లి పట్టణాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముస్లింలకు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ త్యాగానికి.. సేవానిరతికి మారుపేరని పేర్కొన్నారు. నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలు చేసి దైవాన్ని కొలవడం ఆదర్శప్రాయమ న్నారు. రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం నింపాలని గొట్టిపాటి ఆకాంక్షించారు.



నరసరావుపేట : గుంటూరు రోడ్డులోని పెద్ద మసీదుకు విద్యుత్ దీపాలతో అలంకరణ


రూ.15 కోట్లతో.. అక్షయ పాత్ర కమ్యూనిటీ కిచెన్

● శంకుస్థాపన చేసిన ఎంపీ లావు.. ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) కేసానుపల్లి ఎంఏఎం కళాశాల వద్ద అక్షయ పాత్ర ఫౌండేషన్ వారి 80వ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రూ.15 కోట్ల వ్యయంతో ఈ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ కిచెన్ ద్వారా పల్నాడు పరిసర ప్రాంతాల్లోని 15,000 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించడంతో పాటు, అన్న క్యాంటీన్లకు ఆహారం పంపిణీ కూడా చేయనున్నారు. భూమి పూజల్లో పాల్గొన్న టీడీపీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కొన్ని సంవత్సరా లుగా పల్నాడు జిల్లాలో అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను స్థాపించేందుకు ఎంతో కృషి చేశామన్నారు. ప్రభుత్వం, దాతల మద్దతుతో ఈ రోజు 80వ కమ్యూనిటీ కిచెన్‌కు భూమి పూజ నిర్వహించడం ఆనందంగా ఉంది. అక్షయ పాత్ర ఫౌం డేషన్ నాణ్యమైన పోషకాహార భద్రత కలిగిన భోజనాన్ని పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. మహత్తరమైన సేవలో భాగస్వామ్య మైన అక్షయ పాత్ర బృందానికి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద్ బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్, అక్షయ పాత్ర ఫౌండేషన్, హరే కృష్ణ మూమెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాసు, విలాస విగ్రహదాస్, రఘునందన దాస్ సిబ్బంది పాల్గొన్నారు. కిచెన్ నిర్మాణానికి స్థలదాత ఎంఏఎం కళాశాల అధినేత ఎంఆర్ శేషగిరిరావు, నిర్మాణ దాతలు మద్దినేని వెంకట్, హరిత, బీవీ కృష్ణరావు, బీపీస్ అగర్వాల్, వినోద్, భాస్కర రెడ్డిలకు అక్షయపాత్ర ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



భూమి పూజలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



ప్రత్యేక అలంకరణలో రాధా గోవిందులు

రాధాగోవింద చంద్ర మందిరంలో ఉగాది వేడుకలు

నరసరావుపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాధాగోవింద చంద్ర మందిరంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాగోవిందునికి ప్రత్యేక అలంకరణ జరిగింది. శుభ మంగళ హారతి, శుభ దర్శన హారతి నిర్వహించారు. 1008 రకాలతో మహారాజ భోగ నివేదన, అనంతరం మహారాజభోగ హారతి చేసి అందరికి ఉగాది పండుగ సంపూర్ణ ప్రసాద వితరణ చేశారు. ఉత్సవ మూర్తులకు మహా శంఖాభిషేకం జరిగింది. కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



1008 రకాలతో మహా రాజ భోగ నివేదన



పేదరిక నిర్మూలనకు..

ఉక్కు సంకల్పం

● పీ-4పై సర్వత్రా సానుకూల స్పందన
● విజయవంతమైన సభ
● దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
● మార్గదర్శకులకు సూచనలు...
● బంగారు కుటుంబాలకు భరోసా
● రెండు కుటుంబాలతో సీఎం ముఖాముఖి

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర - 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న ఆశయాన్ని చేరుకుంటామని పీ-4 సభ ప్రతిజ్ఞ పూనింది. సున్నా పేదరికం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వెలగపూడి సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన పీ-4 సభ విజయవంతమైంది. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆ తరువాత పీ-4 పథకానికి సంబంధించిన లోగోను చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. అటు తరువాత పీ-4 తాలూకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను కూడ చంద్రబాబు రిమోట్‌తో ఆరంభించారు. ఈ సందర్భంగా మార్గదర్శకులుగా ముగ్గురు దిగ్గజ వ్యాపారవేత్తలను, మంగళగిరి, విజయవాడకు చెందిన రెండు పేద కుటుంబాలవారిని బంగారు కుటుంబాలుగా ఎంచుకుని వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పేదరికం నిర్మూలన లక్ష్యంగా ఇక్కడ తాము ఉక్కు సంకల్పాన్ని తీసుకుంటున్నామని ప్రకటించారు. నా మిత్రుడు పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ ముగ్గురం కలిసి ఈ లక్ష్యాన్ని సాధించి తీరుతామని ఉద్వేగంగా అన్నారు. రాష్ట్రంలో సున్నా పేదరికం లక్ష్యంగా తనకున్న నిర్దిష్టమైన ఆలోచనలను ఈ వేదిక సాక్షిగా ప్రజలముందర పెడుతున్నానని చెప్పారు.

● ఈ కార్యక్రమానికి బంగారు కుటుంబాలుగా ఎంచుకున్నవారిలో మొదట మంగళగిరి పాత రూరల్ మండలం కురగల్లుకు చెందిన కడియం నరసింహ, వెంకట సుశీల దంపతులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో నేరుగా సంభాషిస్తూ కుటుంబ స్థితిగతులను గురించి విచారించారు. ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు నరసింహ సమాధానమిస్తూ తాను గొర్రెలు కాచుకుని జీవనం సాగిస్తున్నట్టు తెలిపాడు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లీదండ్రులు ఉన్నారన్నారు. పదవ తరగతి చదువుతున్న తన కుమారుడ్ని సివిల్ ఇంజనీరుగా చూడాలన్న కోరిక తనకు బలంగా ఉందన్నారు. కుమార్తె ఎనిమిదవ తరగతి చదువుతుందన్నారు. నెలకు ఎంత సంపాదిస్తావంటూ సీఎం అడుగగా...తనకు నెలనెలా జీతం రాదని, మూడు మాసాలకు ఓసారి పెంచిన గొర్రెలలో ఒకదానిని అమ్మి రూ 20 వేల వరకు సంపాదిస్తానని తెలిపారు. భార్య వెంకట సుశీల పూల తోటలలో పూలు కోస్తూ రోజుకు రూ వందనుంచి రెండొందల వరకు సంపాదిస్తుందని చెప్పారు. తనకు మెరుగైన ఉపాధికి సాయమందించడంతోపాటు తన బిడ్డలను చదివించాలని నరసింహ అభ్యర్థించాడు. ఈ సందర్భంగా చంద్రబాబు సూచనల మేరకు మార్గదర్శి గ్రీన్‌గో కంపెనీ యజమాని చలమలశెట్టి అనిల్‌కుమార్ స్పందిస్తూ ఆ కుటుంబానికి తాను అండగా వుంటానని హమీనిచ్చారు. ఇది తనకో గొప్ప అవకాశమని గతంలో సీఎస్ఆర్ కింద కొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ...తనకు సంతృప్తి కలగలేదన్నారు. పీ-4 పేరుతో ఏర్పాటుచేసిన ఈ ప్లాట్‌ఫారం చాల గొప్పదిగా తాను భావిస్తున్నట్టు చెప్పారు.

> చంద్రబాబు మాట్లాడుతూ పీ-4లో తొలిదశగా 30 లక్షల కుటుంబాల వారిని ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకురావాలన్నారు. మార్గదర్శకులు డబ్బులు ఇవ్వడమొక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా తాము బాధ్యత తీసుకున్న కుటుంబాలకు మంచి గైడెన్స్ కూడ ఇవ్వాలన్నారు. వారివారి ఆదాయ పెంపుకు తగిన సలహాలు, సూచనలతోపాటు తగిన అవకాశాలను కూడ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తాను చిన్నతనంలో ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునే వాడినని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ తాను ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. అలాగే పేదలకు సాయమందించే విషయంలో ప్రభుత్వాలు ముందుండి పనిచేసినా వారి ఎదుగుదలకు చాల సమయం పడుతుందన్నారు. నిజానికి ఒక జనరేషన్ మిస్ అయ్యేంత సమయం పడుతుందన్నారు. అందుకే తాను బాగా ఆలోచించి పేదరికం నిర్మూలనకు ఈ పీ-4 పథకానికి రూపకల్పన చేశానని చెప్పారు.

● విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్ నుంచి వచ్చిన మరో బంగారు కుటుంబం తాలూకు యజమాని మత్యా ఇమ్మానుయేల్, శారణ్ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబ దీనగాధను సభ ముందుంచారు. ఇమ్మానుయేల్ రాడ్ బెండింగ్ వృత్తిలో వుంటూ కుటుంబపోషణ చేస్తున్నట్టు తెలిపాడు. ఈ కుటుంబ వ్యధ ఆసక్తిగా అనిపించడంతో చంద్రబాబు వారితో ఎక్కువసేపు మాట్లాడారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం వున్నారు. కుమార్తె అలేఖ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసి చదువుతుండగా...కుమారుడు గని ప్రకాష్ పదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం తనకు తోడు రాడ్ బెండింగ్ పనికి వస్తున్నట్టు తండ్రి ఇమ్మానుయేల్ వివరించాడు. కుమారుడ్ని ఎందుకు చదివించడం లేదని చంద్రబాబు అడుగగా...తనకు వచ్చే రూ 700లు కుటుంబ పోషణకు సరిపోనందున కుమారుడ్ని చదువు ఆపించి తనతోపాటు కూలీపనికి తీసుకువెడుతున్నట్టు చెప్పాడు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడుగగా కుమార్తె అలేఖ్యను మెడిసన్ చేయించాలన్న పట్టుదలతో తమ కుటుంబమంతా కలిసి ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకుందని భార్యాభర్తలు సమాధానమిచ్చారు. కొడుకును చదివించలేక పోతున్నామన్న బాధ నీకు లేదా? అంటూ సీఎం చంద్రబాబు శారణ్‌ను ప్రశ్నించగా ఆమె కళ్లనీళ్ల పెట్టుకున్నారు. మీ తండ్రి మీ అక్కను చదివిస్తూ నిన్ను కూలీపనికి పంపించడం నీకేమీ కోపాన్ని తెప్పించలేదా అంటూ చంద్రబాబు ప్రకాష్‌ను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని తన తండ్రికి సాయం చేస్తున్నానన్న తృప్తి తనకు వుందన్నారు. అలాగే తమ కుటుంబంనుంచి అక్కను డాక్టర్‌ను చేయాలన్న పట్టుదల తమందరికీ ఉందంటూ ప్రకాష్ చెప్పాడు. ఆ వెంటనే నీవు బైపీసి ఎందుకు తీసుకున్నావని చంద్రబాబు అలేఖ్యను అడుగగా తనకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉందన్నారు. డాక్టరే కావాలని ఎందుకనుకుంటున్నావని అడుగ్గా తమ పేద కుటుంబాల వారికి ఉచితంగా వైద్యసాయం అందించాలన్న లక్ష్యంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అలేఖ్య చంద్రబాబుకు వివరించింది. దీంతో చంద్రబాబు ఆమెను అభినందిస్తూ పేదలలో పుట్టినంత మాత్రాన మంచి ఆశయాలు వుండకూడదన్న రూలేమీ లేదన్నారు. అనంతరం మార్గదర్శిగా జైరాజ్ స్టీల్ కంపెనీ యజమాని సజ్జన కుమార్ గోయంకా స్పందిస్తూ అలేఖ్యను తాను మెడిసన్ చదివించగలనని హమీనిచ్చారు.

● మరో మార్గదర్శి మేఘా ఇంజనీరింగ్ కంపెనీ యజమాని పీవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 14న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పీ-4 పథకాన్ని గురించి తొలుత ప్రకటించారన్నారు. ఇది కచ్చితంగా ఓ గేమ్ ఛేంజర్‌గా నిలబడుతుందన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలన్న కాంక్ష సీఎం చంద్రబాబులో చాల బలంగా ఉందన్నారు. చంద్రబాబు సూచనతో తాను కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకుని దాని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని చెప్పారు. తాను వ్యాపారపరంగా 20 దేశాలు, 20 రాష్ట్రాలలో తిరుగుతుంటానని...కానీ ఈ ప్రభుత్వం మాదిరి ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపన ఎక్కడా ఇంత బలంగా కనిపించలేదని చెప్పారు. ఈ సభా కార్యక్రమానికి ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులు



కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులతో ఒకే టేబుల్ వద్ద కూర్చుని ముచ్చటిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

జీపాట్ 2025

గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) విడుదల చేసింది. ఎంఫార్మసీ అడ్మిషన్స్ కోసం ఉద్దేశించిన ఈ కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ 2025 మే 25న జరుగుతుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విండో ఓపెన్ అవుతుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు natboard.edu.in లింక్ యాక్టివేట్ అయిన తరవాత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత, నాలుగు సంవత్సరాల ఫార్మసీ విద్య పూర్తిచేసుకున్న అభ్యర్థులు దరఖాస్తునకు అర్హులు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదు. మే 21న హాల్ టికెట్లు విడుదల చేస్తారు. మే 25న పరీక్ష కాగా, ఫలితాలను జూన్ 25న వెల్లడించే అవకాశం ఉంది. జీపాట్ అడ్మిషన్ ప్రొసీజర్ ప్రారంభం కంటే ముందే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.3500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.2500. పూర్తి వివరాలకు ఎన్‌బీఈఎమ్ఎస్ వెబ్‌సైట్ చూడవచ్చు.

30 రోజుల్లో నీట్

ఇలా ప్లాన్ చేయండి



నీట్ పరీక్షకు దాదాపుగా ముప్పై రోజుల వ్యవధి ఉంది. ఈ సమయంలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన వ్యూహం అవసరం. మొత్తం 180 ప్రశ్నలతో నీట్ యూజీ ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ 45, కెమిస్ట్రీ 45, బయాలజీ 90 ఉంటాయనే విషయం తెలిసిందే. ఇందులో సరైన సమాధానానికి 4 నాలుగు మార్కులు లభిస్తాయి. తప్పుగా రాసిన సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తారు. పరీక్షకు సంబంధించి ఇలా మీదైన సొంత వ్యూహం రూపొందించుకోండి.

- 30 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మొదట ప్రిపేర్ చేసుకోండి. మూడు గంటలు ఫిజిక్స్, మూడు గంటలు కెమిస్ట్రీ, మూడు గంటలు బయాలజీకి కేటాయించండి.
- గత పరీక్షల ఆధారంగా అధ్యాయాల వెయిటేజీని విశ్లేషించండి. 2021 నుంచి 2024 వరకు పేపర్ల ట్రెండ్‌ను గమనించండి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా అన్ని సబ్జెక్టుల కాన్సెప్టులను ఎన్‌సీఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నేర్చుకోండి. ప్రతీ చాప్టర్‌కు షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకోండి.
- ప్రతీ సబ్జెక్టులోనూ ఎక్కువ వెయిటేజీ ఉన్న చాప్టర్లపై దృష్టి పెట్టండి. అలాగే ప్రతీ విద్యార్థి కొన్ని చాప్టర్లను సులభం అని భావిస్తారు. వాటిపై కూడా తప్పనిసరి దృష్టి సారించాలి.

> సొంతంగా చదువుకునే సమయంలో సందేహం వస్తే టెక్నాలజీపై ఆధారపడండి. అంతేతప్ప సందేహాన్ని తీర్చుకునే విషయంలో వాయిదా అనే మాటే వద్దు. యూట్యూబ్స్, సబ్జెక్ట్ వెబ్‌సైట్స్ ఉపయోగించుకోండి.

- రోజూ ఫిజిక్స్ ఫార్ములాలు రివిజన్ చేయండి. దీనితోపాటు 2021 నుంచి 2024 సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. రోజుకు ఒక గంట అయినా ఈ పనిచేయాలి.
- ఫిజిక్స్ ప్రాబ్లమ్ సాధించే సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పాటించండి. ఒక ప్రశ్నను ఒక నిమిషంలో పూర్తి చేసేలా ఉండాలి.
- ఫిజిక్స్‌లో రోజుకు కనీసం 30-40 ప్రశ్నలు పూర్తి చేసేలా చూసుకోండి.
- రోజులో మొదట ఫిజిక్స్ సబ్జెక్టు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఫ్రెష్ మైండ్‌తో ఎక్కువగా అర్థం అవుతుంది.
- కెమిస్ట్రీ విషయానికి వస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు సాధించండి. మెకానిజమ్స్ ప్రాక్టీస్ చేయండి. ఫ్లోచార్ట్స్ గుర్తుంచుకోండి.
- కెమిస్ట్రీ ఫార్ములా రివిజన్‌తోపాటు 2019 నుంచి 2024 వరకు ప్రశ్న పత్రాలపై పట్టుసాధించాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలలో బలమైన అంశాలపై దృష్టి సారించండి. ఉదాహరణకు ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీలో బలహీనంగా ఉంటే పీ-బ్లాక్ ఎలిమెంట్స్‌కో ఆర్డినేట్ కాంపౌండ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించండి.
- బయాలజీ విషయానికి వస్తే ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు చదవండి. జన్యుశాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం, బయోటెక్నాలజీ, పర్యావరణ శాస్త్రం మొదలైన వాటికి ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- మెటీరియల్ చదివే సమయంలో రాసుకున్న షార్ట్‌నోట్స్ రివిజన్ సమయంలో బాగా ఉపయోగపడుతుంది. తరుచూ ఎంట్రెన్స్‌లో వచ్చే చాప్టర్లు ఎక్కువగా రివిజన్ చేయడాలి.
- ముఖ్యమైన డయాగ్రామ్ చదవండి. ప్రతీ డయాగ్రామ్ లేబుల్స్ క్షుణ్ణంగా పరిశీలించండి.
- బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అందుకే డిటైల్డ్‌గా చదవడానికి ప్రయత్నించండి.
- వీలయినన్ని మాక్ టెస్ట్‌లు రాయండి. దీంతో ఏయే చాప్టర్లపై పట్టు ఉందో అర్థం అవుతుంది. అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ తెలుస్తుంది.
- నా ప్రిపరేషన్ సరిగా లేదేమో లేదా సరిపోలేదేమో అనే భావనకు లోనుకావద్దు. ఆత్మవిశ్వాంతో ఉండండి.



- డా. కిషన్ రావు టంకశాల
సంజీవని మెడికల్ అకాడమి

SCHOLARSHIP ALERT

The Cadence Program

The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).
Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.
Prizes & Rewards: Financial support for covering key educational expenses.
Last Date to Apply : 31-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School Scholarship

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.
Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.
Prizes & Rewards : An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.
Last Date to Apply : 15-04-2025
Application mode: Online and offline via email at (admissions@doonschool.com)
Short Url: www.b4s.in/aj/DSSE2

buddy4study.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్స్



జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాలనే భావం స్థిరపడి పోయింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఇలా ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన వారికైనా మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే అవకాశం ఉంది. అలాగే ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటున్నవారు కూడా ఈ కోర్సులు చేసి కెరీర్‌లో మరింత ముందుకు వెళ్లగలుగుతున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల మేనేజ్‌మెంట్ కోర్సుల నోటిఫికేషన్ వెలువడింది. ఒకసారి పరిశీలించండి.

ఐపీఈ హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ 2025-27 విద్యా సంవత్సరానికి పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://www.ipeindia.org/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు

పీజీడీఎం - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - మార్కెటింగ్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
పీజీడీఎం - ఇంటర్నేషనల్ బిజినెస్
పీజీడీఎం - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బిజినెస్ అనాలసిస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/గ్జాట్/జీమ్యాట్/ మ్యాట్/ సీమ్యాట్/ ఏటీఎంఏ టెస్ట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఏప్రిల్ 12

'నిట్' కురుక్షేత్ర

హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://nitkkr.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.
అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు, క్యాట్/ సీమ్యాట్/ మ్యాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 5
గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీ ప్రకటన: 2025 మే 8

ఐఐఎం బోధ్‌గయ

ఐఐఎం బోద్‌గయ, టీంలీజ్ ఎడ్యుటెక్‌తో కలిసి ఆన్‌లైన్ 'ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్'(ఈఎంబీఏ)ని డిజైన్ చేసింది. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ కోర్సు మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లకు ఉపయోగపడుతుంది. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, స్ట్రాటజీ తదితర సబ్జెక్టులు ఇందులో ఉంటాయి. వివరాల కోసం https://iimb-gonline.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

JOBS

ఇండియన్ నేవీలో అగ్నివీర్

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియమకానికి నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన వారికి 'ఐఎన్ఎస్ చిల్కా'లో శిక్షణ ఉంటుంది. 2025, 2026 బ్యాచ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇది.
ప్రకటన పేరు: అగ్నివీర్(మెట్రిక్ రిక్రూట్-ఎంఆర్) ఖాళీలు
అర్హత: పదో తరగతి పాసైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
వయస్సు: 02/2025 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2004 సెప్టెంబరు 1 నుంచి 2008 ఫిబ్రవరి 29 మధ్యలో జన్మించి ఉండాలి. 01/2026 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 ఫిబ్రవరి 1 నుంచి 2008 జూలై 31 లోపు జన్మించి ఉండాలి. 02/2026 బ్యాంక్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 సెప్టెంబరు 1 నుంచి 2008 డిసెంబర్ 31లోపు జన్మించి ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: నేవీ ఎంట్రెన్స్ ద్వారా షార్ట్ లిస్ట్ చేస్తారు. రాత పరీక్ష, శారీరక దారుడ్య పరీక్ష, వైద్య పరీక్ష ఉంటాయి.
పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ బాషల్లో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్, సైన్స్, మేథ్స్ జనరల్ అవేర్‌నెస్ నాలుగు విభాగాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 10
ఎంట్రెన్స్ టెస్ట్: 2025 మే 25న
వెబ్‌సైట్ : https://www.joinindiannavy.gov.in/

ఆదివాసీలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్



సభలో ప్రసంగిస్తున్న పౌరహక్కుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై జరుగుతున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర స్థాయి సభ మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో ఆదివారం జరిగింది. ఎస్కే నాగూర్‌వలి అధ్యక్షతన జరిగిన ఈ సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో గత ఏడాది నుంచి పోలీసులు చేస్తున్న ప్రతి ఎన్‌కౌంటర్ బూటకమని పేర్కొన్నారు. కేవలం ద్రౌపది ముర్ము లాంటి వ్యక్తులను రాష్ట్రపతిగా చూపించి ఆదివాసీలపై బూటకపు ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరిపి కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక కార్య దర్శి పొనుగోటి కృపాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రశ్నించే వ్యక్తులపై దాడులు, హత్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో పౌరహక్కుల సంఘం నేతలు కోటేశ్వరరావు, గోపీనాథ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న వ్యాపారస్థులు

- రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం
- రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు
- రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొంతమంది వ్యాపారస్థులు రైతుల ముసుగు ధరిస్తున్నారు. కర్నాటక రాష్ట్రంలో మిర్చి క్వింటాల్ ధర రూ. 6 వేలు మాత్రమే ఉండటంతో అక్కడి రైతుల వద్ద కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. యార్డులో వ్యాపారస్థులు మిర్చిని అమ్మడానికి వీలు లేకపోవడంతో కొంతమంది రైతుల ఆధార్‌లు, వారి బ్యాంకు అకౌంట్ల వివరాలు తీసుకుని వాళ్ల పేర్లతో మిరపకాయలను అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి కర్నాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి ఇక్కడికి దిగుమతి అవుతుండడానికి ఇదొక కారణంగా మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే యార్డులోకి అనుమతించాలని సిబ్బందికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కర్నాటక రాష్ట్రంలోని బళ్లారి, హుబ్లీ, హోస్‌పేట, రాయచూర్ వంటి ప్రాంతాల్లో మిర్చి ధర భారీగా పతనమైంది. అక్కడి మార్కెట్ కమిటీల్లో మిర్చి క్వింటాల్ ధర రూ.6 వేలు మాత్రమే ఉన్నది. ఈ విషయాన్ని తెలుసుకొన్న కొంతమంది వ్యాపారస్థులు నేరుగా అక్కడికి వెళ్లి రైతుల వద్ద మిర్చిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆ మిర్చిని గుంటూరు మార్కెట్ కమిటీకి తరలించి రైతుల పేర్లతో కమీషన్ దుకాణాల వద్ద దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి వస్తున్న మిర్చిలో నాణ్యత ఏమాత్రం ఉండటం లేదు. తేమ, తాలు శాతం అధిక మోతాదులో ఉంటున్నాయి. దీంతో ఇక్కడి ఎగుమతిదారులు క్వింటాల్‌కి రూ. 8 వేల నుంచి రూ. 9 వేల ధర మాత్రమే చెల్లిస్తున్నారు.

దీని వలన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులు తీసుకొస్తున్న మిర్చి ధరపై ఆ ప్రభావం పడుతున్నది. అధిక ఎరైవల్స్ కారణంగా మార్కెట్ కమిటీకి వచ్చిన సరుకు అదే రోజు బయటకు వెళ్లిపోవడం లేదు. ఈ కారణంగా కొనుగోళ్లు ఆశాజనకంగా జరగడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 11,781 కంటే తక్కువకే రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి. గత కొన్ని రోజులుగా వస్తున్న ఎరైవల్స్‌లో కొంతమంది రైతుల పేర్లు రొటేషన్ అవుతున్నట్లు అధికారవర్గాలు గుర్తించాయి. ఇదే విషయాన్ని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నా యుడుకి నివేదించాయి. దీనిపై ఆయన స్పందించి రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వ్యాపారస్థులు తీసుకొచ్చే మిర్చిని ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతించొద్దన్నారు. మంత్రి ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తారో మంగళవారం చూడాలి.

తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- రూ. 30 లక్షల ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థినికి స్కాలర్‌షిప్పు చెక్కును అందజేస్తున్న పెమ్మసాని, చిత్రంలో తులసీ రామచంద్రప్రభు, యోగీష్‌చంద్ర, కృష్ణచైతన్య తదితరులు

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తులసీ సీడ్స్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ మేనేజింగ్ ట్రస్టీ తులసీ రామచంద్రప్రభు ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డులోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం 570 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు 30 లక్షల రూపాయల ఉపకార వేతనాలను పెమ్మసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రామచంద్రప్రభు ఎటువంటి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోయినా యువతకు విద్య, ఉద్యోగ విషయాలలో తోడ్పడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రభుత్వానికి లక్షల రూపాయలను వెచ్చిస్తున్నారని తెలిపారు. రామచంద్రప్రభు ఆశయాన్ని అర్థం చేసుకుని వారు అందించే ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుని సమాజానికి మేలు చేయాలని కోరారు. గుంటూరు సర్వజనాసుపత్రికి, మెడికల్ కళాశాల బస్సులకు పది కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని ప్రభు సేవలను ఆయన కొనియాడారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కేవలం 16 రూపాయలు పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, ఇంటర్, బీటెక్ చదివే రోజుల్లో గవర్నమెంట్ నుంచి వచ్చిన 450 రూపాయలు ఉపకారవేతనాలతో చదువుకుని జీవితంలో స్థిరపడ్డానని గుర్తుచేశారు. తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96 లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి 36 వేల మంది విద్యార్థులకు రూ. 22 కోట్ల ఉపకారవేతనాలుగా పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. అలాగే 2022, 2023, 2024 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా మొత్తం రూ. 30 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్,అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ ట్రస్టీలు తులసీ యోగీష్ చంద్ర, తులసీ కృష్ణ చైతన్య, నారదాసు శ్రీహరిరావు, మలిశెట్టి సుబ్బారావు, ఉగ్గిరాల సీతారామయ్య, తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, చందనం శ్రీనివాస్, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, జంగాల సాంబశివరావు, మేకల రవీంద్ర, పుచ్చకాయలు ఆనంద్, కనాథం నరేంద్రనాథ్, దళవాయి సుబ్రహ్మణ్యం, మిరియాల శ్రీనివాస్, పంతంగి జనార్దనరావు, తులసి ఆదిత్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపోటీల్లో గడివేముల జతకు ప్రథమస్థానం



రెండు పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు


తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో రెండు పళ్ల విభాగంలో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన ఎరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత ప్రథమ స్థానం సాధించింది. 10 నిమిషాల సమయంలో 3592 అడుగుల దూరం బండ లాగాయి. ఆదివారం జరిగిన ఈ విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. పల్నాడు జిల్లా ఇస్సపాలెంకు చెందిన వెంకటరామాంజనేయులు ఎడ్ల జత 3228 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం సాధించాయి. బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవికుమార్ యాత్, పల్నాడు జిల్లా మాచాయి పాలెంకు చెందిన చెరుకూరి నాగేశ్వరరావు, కార్తికేయల కంబైన్డ్ ఎడ్ల జత 2979.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, ఎన్టీఆర్ జిల్లా మైలవరం స్వామ్రాజ్యమ్మ బుల్స్ 2821 అడుగులు లాగి నాల్గో స్థానం, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పోసపాడుకు చెందిన లిఖిత చౌదరి ఎడ్లు 2700 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, బాపట్ల జిల్లా నాగరాజుపల్లికి చెందిన హర్షవర్ధన్ ధనుష్ ఎడ్ల జత 2529 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, బాపట్ల జిల్లా మరుప్రోలు వారిపాలెంకు చెందిన వెంకట అయ్యప్ప రెడ్డి గార్లపాడు రైతు చాన్వికచౌదరి కంబైన్డ్ ఎడ్లు 2501 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎరుకలపూడి, సంగం జాగర్లమూడి రైతులు శ్రీను, సాత్విక్, రవీంద్రవర్మల ఎడ్లజత 2384 అడుగుల దూరం లాగి 8వ స్థానం, దోనేపూడి రైతు వెనిగళ్ల యజ్ఞశ్రీ ఎడ్ల జత 2342 అడుగుల దూరం లాగి 9వ స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి 9వ స్థానం వరకు) దాతలు పరుచూరి పవన్ రూ.30 వేలు, వంగా సాంబిరెడ్డి రూ.25 వేలు, అమ్మిశెట్టి కిషోర్, తాడికొండ విశ్వేశ్వరరావు రూ.20 వేలు, రేపల్లె సుభాని రూ.15 వేలు, పెమ్మసాని జయప్రకాష్‌రూ.12వేలు, వట్టికూటి ప్రసాద్ రూ.10వేలు, పణిదపు దుర్గ రూ.8వేలు, చందోలు వృద్వీలత రూ.6వేలు, జాస్తి బసవయ్య రూ.5 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన పోటీల్లో పాల్గొన్న జతలకు రూ.5 వేలు బహుమతులు అందించారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

చిలకలూరిపేట, మార్చి30 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ తిరగబడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జెడ శామ్యూల్(19) ట్రాక్టర్ నడుపుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో అతడు ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ జీ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- వైభవంగా సాహితీ వసంతోత్సవం



ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం అందజేసి సత్కరిస్తున్న జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, కృష్ణబాబు, పులి శ్రీనివాసులు, సాహితీ సమాఖ్య సభ్యులు

గుంటూరు(తూర్పు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఔన్నత్యాన్ని, వైభవాన్ని ముందు తరాలకు అందించేలా నేటి తరం కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా 28 వసంతాల సాహితీ వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. సభకు జిల్లా సాహితి సమాఖ్య అధ్యక్షుడు డీవీఎస్‌బీ రామమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్న సాహితి సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. కవి సమ్మేళనాలు మండలస్థాయిలో కూడా నిర్వహించాలని సూచించారు. ఎం టీ కృష్ణబాబు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ శుభం కలుగుతుందని ఆకాంక్షించారు. రాశి ఫలాలు, ముహూర్తాలు కేవలం అపోహ మాత్రమేనని కష్టం, ప్రయత్నం మనల్ని జీవితంలో గెలిపిస్తుందని అన్నారు. ముహూర్తాలను నమ్మి తెలుగు రాష్ట్రాల్లో 53 శాతం నవ జంటలు శస్త్రచికిత్సల ద్వారా పిల్లలను కంటున్నారని ఇది బాధాకరమన్నారు. ముహూర్తాలపై అపోహలు తొలగించాల్సిన బాధ్యత పండితులపై ఉందన్నారు. మనతోపాటు సమాజం కూడా బాగుండాలనేదే పీ 4 లక్ష్యమని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అంతకు ముందు విష్ణుసహస్రనామ పారాయణం, వేద పఠనం, శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథ స్వామి పంచాంగ శ్రవణం, ఆర్ సూర్యలక్ష్మీ చే నాదస్వర కచేరి జరిగింది. ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు, సినీ నటుడు కేదార్ శంకర్, వీవీ రామ్‌కుమార్, రచయిత కే కృష్ణవేణీ, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విశ్వావసు నామ సాహితీ పురస్కారం కవి, సినీ గేయ రచయిత రసరాజుకు, ఆత్మీయ సత్కారం ప్రముఖ సినీ నటుడు కేదార్ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి తదితరులు పాల్గొనగా, కార్యక్రమాన్ని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పర్యవేక్షించారు.

స్లాట్ తీసుకుంటేనే రిజిస్ట్రేషన్

గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ షరీల్ బాబు

గుంటూరు సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో స్లాట్ (ముందస్తు అపాయింట్ మెంట్) బుక్ చేసుకున్న వారు మాత్రమే ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నట్లు గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రతి రోజు 72 స్లాట్‌లు అందుబాటులో వుంటాయని, ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల కొద్దీ సమయం వేచి చూసే పనిలేకుండా సులభంగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఈ కొత్త పద్ధతిని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ చేయటం వీలు పడదని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి అందుబాటులో ఉన్న సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కు రావాలని సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు సూచించారు. ఈ విషయాన్ని ప్రజల కు వివరించేందుకు, అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మద్యం షాపు తొలగించాలని మహిళల నిరసన

తెనాలి క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ముత్తింశెట్టిపాలెంలో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని ఆదివారం మహిళలు, స్థానికులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇక్కడికి వచ్చే తాగుబోతుల వల్ల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మార్గం గుండానే వైకుంఠపురం దేవాలయానికి వెళ్లేవారికి, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకు మార్గం కావడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. ఇలాంటి ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసి సమస్యలు సృష్టించవద్దంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు టెంట్‌లు వేసుకుని మహిళలు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిప్రతం అందజేశారు. పోలీసుల పహారా మధ్య ఈ ప్రాంత వాసులు రాత్రయినా ధర్నా కొనసాగిస్తూనే ఉన్నారు.



మద్యం షాపు వద్ద ఎండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, స్థానికులు

రేపు జాతీయస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంతారావు, బ్రహ్మాచార్యులు

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 14వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయని పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ అధ్యక్షులు డీఎల్ కాంతారావు తెలిపారు. నాటకోత్సవాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో దావులూరి సోమశేఖరరావు కళా ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు జరుగుతాయన్నారు. నట సార్వభౌమ నందమూరి తారక రామారావు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును మంగళవారం ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి కె.విజయలక్ష్మికి ప్రదానం చేస్తామని, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని నాటకోత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ కళాకారులు జేబు చెప్పిన ఊసులు సాంఘిక నాటిక ప్రదర్శిస్తారని, బుధవారం డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ కళాకారులు ది లెసన్ సాంఘిక నాటికను, విశాఖపట్నం సాయి కళానికేతన్ కళాకారులు పౌరాణిక పద్య నాటకం శశిరేఖ పరిణయం ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 520.40 అడుగులు ఉంది. ఇది 150.00 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 13,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

పల్నాడు వార్తలు


సీఎం చంద్రబాబు నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న సయ్యద్ నసీర్ అహ్మద్, రాధాశ్రీ, సాహితీ పురస్కారం అందుకుంటున్న రవికుమార్

పలువురికి ఉగాది పురస్కారాలు

పిడుగురాళ్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన చరిత్రకారుడు సయ్యద్‌నసీర్ అహ్మద్‌కు ఉగాది పురస్కారాన్ని ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందజేశారు. స్వాతంత్రోద్యమంలో భారతీయ ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ గత మూడు దశాబ్దాలుగా 25 పరిశోధనాత్మక గ్రంథాలను ఆయన రచించారు. పిడుగురాళ్లకు చెందిన డీఏవీ ఆర్‌కే ప్రసాద్(రాధాశ్రీ) ముఖ్యమంత్రి నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. రాధాశ్రీ గత 50 ఏళ్లుగా తెలుగు సాహిత్యానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వ ఉగాది మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఈ పురస్కారాలు అందుకున్నారు.

క్రోసూరికి సాహితీ పురస్కారం

దాచేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సాహిత్యరంగంలో విశేషమైన సేవలందించిన దాచేపల్లికి చెందిన ఉపాధ్యాయుడు క్రోసూరి రవికుమార్‌కు ముఖ్యమంత్రి సాహితీ పురస్కారాన్ని అందించారు.

అమరావతిలో ఇద్దరికి..

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి, భాషా సాంస్కృతిక శాఖ అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులుకు సామాజిక సేవా పురస్కారాన్ని ముఖ్యమంత్రి అందజేశారు. మండలంలోని ఉంగుటూరు గ్రామానికి చెందిన రైతు నల్లూరి సాంబశివరావుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపిక చేసి ముఖ్యమంత్రి ద్వారా అందజేసింది. వీరిని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అభినందించారు.

సమాజహితాన్ని కోరే వేద పండితులు: ఎంపీ

రెంటచింతల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేదాధ్యయనం చేసి దేవుని ప్రతినిధులుగా వుండే పండితులు సమాజ హితాన్ని కోరుకుంటారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా రెంటచింతలకు చెందిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పూజారి గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులును కలెక్టరేట్‌లో ఎంపీ ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులును ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ఫోన్‌లో అభినందించారు.

దుర్గి శిల్పి చెన్నుపాటికి...

దుర్గి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల్లో దుర్గి శిల్పి చెన్నుపాటి శ్రీనివాసాచారి ఉగాది పురస్కారం అందుకున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ పురస్కారం అందజేశారు.


ముఖ్యమంత్రి నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న ఎన్ రాంబాబు, వీరాంజనేయులు


నరసరావుపేటలో ఉగాది పురస్కారం అందుకున్న శిల్పి చెన్నుపాటి, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులను సన్మానిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ

సమృద్ధిగా వర్షాలు

- పంచాంగ శ్రవణంలో వేదపండితులు
- వాడవాడలా ఉగాది వేడుకలు


మాచర్ల: పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


బెల్లంకొండ: తిరుపతిలో పంచాంగం శ్రవణం చేస్తున్న ఫణికుమార్‌శర్మ

మాచర్లటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పంచాంగ కర్త, వేద పండితుడు సాగి వెంకటేశ్వరశర్మ అన్నారు. పట్టణంలోని కోదండరామాలయంలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం గావించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జూలకంటిని కోదండ రామాలయం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కజ్జం సైదయ్య, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, పంగులూరి పుల్లయ్య, సూరె యలమంద, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల మధ్య ఉగాది సంబరాలు

గురజాలటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో అక్షయఫౌండేషన్ ఆధ్వర్యాన ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం వృద్ధుల మధ్య సీఐ ఆవుల భాస్కర్ ఉగాది సంబరాలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సీఐ భాస్కర్ వృద్ధులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, శరమాళ్ల హనుమంతరావు, ఫౌండేషన్ అధ్యక్షురాలు మల్లీశ్వరి, ఎస్ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో పంటలు బాగా పండుతాయని వేద పండితుడు సాగి వెంకటేశ్వరశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు కొమండూరి సత్యనారాయణచార్యులు అన్నారు. ఉగాది సందర్భంగా స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్‌చెన్నకేశవ అయ్యవారు, పలిశెట్టి కోటేశ్వరరావు, బొమ్మిన కొండలు, ఆర్యవైశ్య సంఘ నేత కొత్త మరళి హరనాథ్, జక్కా నరసింహారావు, బొమ్మిన శ్రీను తదితరులు పాల్గొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ ప్రధానఅర్చకుడు సాగి మణికంఠశాస్త్రి పంచాంగ పఠనం గావించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్ది హనుమంతరావు, జిల్లా కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, మాజీ అధ్యక్షుడు చిత్రాల వెంకటకోటేశ్వరరావు, కజ్జం పెద ఆంజనేయులు, వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు మిత్తింటి సాంబశివరావు, ఏ రామకృష్ణ, కొత్త బ్రహ్మేశ్వరరావు, సముద్రాల సాయి తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను ఆదివారం గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవి ఆలయంలో సాగి విశ్వేశ్వరశాస్త్రి, తుమృకోట, రెంటాల, మంచికల్లు, పాలువాయి గ్రామాల్లోని ఆలయాల్లో వేద పండితులచే పంచాంగ శ్రవణం జరిగింది. ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి ఆయా ఆలయాల చైర్మన్లు కేవీ నాగేశ్వరరావు, నాళం పెదబాబు, పందిరి శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● దుర్గి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో ఆదివారం పంచాంగ పఠనం గావించారు. వేద పండితులు రాశి ఫలాలను వివరించారు. దుర్గిలోని శివాలయంలో వేదపండితుడు బాబు పంచాంగ పఠనం గావించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామసంవత్సరాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాలలోని దేవాలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం గావించారు. పట్టణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాల అనంతరం పురోహితులు బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ పంచాంగాన్ని వినిపించారు. దేవస్థానం అధ్యక్షుడు యేలూరి చంద్రశేఖరరావు, ప్రధానకార్యదర్శి కొల్లిశెట్టి సుబ్బారావు, కోశాధికారి కొత్త లక్ష్మీనారాయణ, కట్టమూరి శంకరరావు, వీవీ నాగేశ్వరరావు, కుటుంబరావు పాల్గొన్నారు.

● దాచేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లోని పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో దేవాలయానికి చేరుకున్న తరుణంలో గ్రామపెద్దలు, ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లుచేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

● మాచవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల శివాలయాల్లో పురోహితులు పంచాంగ పఠనం గావించారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని ప్రజలు ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. ఉగాది పచ్చళ్ళను పంపిణీచేశారు. దేవాలయం వద్ద పంచాంగ శ్రవణం చేశారు.

● నకరికల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుంకులగుంట వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమరావతిలో...

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలు, ఇళ్లలో వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితులతో పంచాగ శ్రవణం చేయించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడితో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక సత్యసాయిబాబా ఆలయంలో సేవాసమితి అధ్యక్షుడు చేకూరి జాజిబాబు భక్తులకు అన్నదానం చేశారు. అన్ని ఆలయాలలో అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు.


అమరావతి అమరేశ్వరాలయంలో పంచాగ శ్రవణం చేస్తున్న అర్చకులు

● క్రోసూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. క్రోసూరులోని వీరభద్రస్వామి దేవాలయం, నరసింహస్వామి దేవాలయం, బయ్యవరంలోని శివాలయం, బాలేమర్రులోని మల్లికార్జునస్వామి దేవాలయం, దొడ్లేరులోని భీమలింగేశ్వరస్వామి, 88 తాళ్ళూరులోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణం జరిగింది.

● అచ్చంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఆంజనేయుని విగ్రహం సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వైస్‌గవర్నర్ సూరె వెంకటకోటిలింగం పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడ్డగిరి వెంకట పార్థసారధి, అనుమోలు శేషగిరి, కొప్పురావూరి మురళీ, ఏలూరి శ్రీనివాసరావు, భవిరిశెట్టి రవి కుమార్, వీరవల్లి శ్రీనివాసరావు, భూరె నరసింహారావు, పులిపాటి పద్మ, అన్నవరపు సరోజిని ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది.

● పెదకూరపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాలలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. పంచాంగ శ్రవణాన్ని వేద పండితులు వివరించారు.

తిరుపతిలో ఫణికుమార్ శర్మ పంచాంగం శ్రవణం

బెల్లంకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలలో ఉగాది పండుగ సందర్భంగా శ్రీవిశ్వావసు నామ సంవత్సరాన బెల్లంకొండ గ్రామానికి చెందిన బ్రాహ్మణ శ్రీ పులుపుల ఫణికుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దేవస్థాన ఈవో ఆయనను ఘనంగా సన్మానించారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- మాచర్ల మంచినీటి పథకానికి రూ.95.91 కోట్లు మంజూరు


పీడబ్ల్యూడీ కాలనీలో నిర్మించిన హైలెవల్ ఓవర్‌హెడ్ ట్యాంకు


ఫైర్ స్టేషన్ వద్ద హైలెవల్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన దృశ్యం


2023లో మంత్రి సురేష్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మాచర్లటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి తాగునీటి వెతలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) పథకం ద్వారా నిధులు మంజూరుచేసింది. ఈ పథకం ద్వారా మాచర్ల మంచినీటి పథకానికి సుమారు రూ.95.91 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పక్కనే కృష్ణానది ఉన్నా పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఇప్పటికి రెండుసార్లు శంకుస్థాపనలు జరిగినా పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మాచర్ల పట్టణానికి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారంకోసం 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి హయాంలో సుమారు రూ.30కోట్ల పైచిలుకు నిధులతో బుగ్గవాగు నుంచి మాచర్ల పట్టణానికి నీటిని తరలించే పథకానికి నెహ్రూనగర్ ఫైర్ స్టేషన్ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో ఒక హైలెవల్ ట్యాంకు, సంపులు, ఫిల్టర్‌బెడ్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. పీడబ్ల్యూ కాలనీలో హైలెవల్ వాటర్ ట్యాంకు నిర్మించారు. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. 2023లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా సుమారు రూ.90కోట్ల అంచనా వ్యయంతో తిరిగి ఈ పథకానికి అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ చేత ఫైర్‌స్టేషన్ వద్ద శంకుస్థాపన చేయించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జలజీవన్ మిషన్ కింద ఈ పథకం మంజూరైంది. కాంట్రాక్టర్ పదిశాతం పనులు నిర్వహించి చేతులెత్తేశాడు. మూడోసారి కూటమి ప్రభుత్వం ఈ పథకానికి తిరిగి ఊపిరిలూదింది. ఈ పథకం ద్వారా మాచర్ల పట్టణ ప్రజల దాహార్తి తీరనుంది.


పీ-4 కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివెళ్తున్న కూటమి నేతలు, అధికారులు, మహిళలు

పీ-4 కార్యక్రమానికి తరలివెళ్లిన కూటమి నేతలు

గురజాలటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్న పీ-4 ప్రారంభ కార్యక్రమానికి గురజాల నుంచి కూటమి నేతలు, మహిళలు తరలివెళ్లారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును ఏర్పాటుచేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ నేతృత్వంలో కూటమి నేతలు, అధికారులు, మహిళలు పీ-4 ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జూలకంటి


ఇఫ్తార్‌లో వడ్డిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని జెండాచెట్టు వద్ద ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్థానిక నూరు మసీదులో ప్రభుత్వ ఖాజీ బాజి ఇమాం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లింలతో దీక్ష విరమింపజేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, ముస్లిం మతపెద్దలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంటచింతల జలజీవన్ మిషన్‌కు రూ.1.83 కోట్లు విడుదల

రెంటచింతల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకం ద్వారా రెంటచింతల టౌన్‌కు రూ.1.83కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికార ప్రతినిధి పంగులూరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందపేటలో నాలుగు సెంట్ల విస్తీర్ణంలో లక్ష లీటర్ల నీటి సామర్థ్యంతో రక్షిత మంచినీటి పథకం(ఓవర్ హెడ్ ట్యాంక్) కు రూ.84లక్షలు, రేగులమాన్యం, ఎర్రపాలెం, అంబేద్కర్ కాలనీ, సర్వానకుంట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తాగునీటి కుళాయి ఏర్పాటుచేసే నిమిత్తం రూ.99లక్షలు విడుదలయ్యాయన్నారు. మిగతా గ్రామాలకు మంచినీటి ట్యాప్‌లు ఏర్పాటునిమిత్తం వాటర్ గ్రిడ్ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

మాచవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామానికి చెందిన ఇరువురిని హత్యాయత్నం కేసులో అరెస్టు చేశారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు కథనం మేరకు.. పిన్నెల్లికి చెందిన చింతపల్లి పెదసైదా, చింతపల్లి అల్లాభక్షు అనే ఇద్దరు ఎలిశెట్టి శ్రీనివాసరావుపై 2023 మేలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో పెదసైదా, అల్లాభక్షులను సారంగపల్లి అగ్రహారంలో అరెస్టు చేశారు. వీరిని శనివారం పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-20, 15 పురుషులు, స్త్రీల రెజ్లింగ్ ఎంపికలు జరిగినట్టు కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. అండర్ 20 స్త్రీల విభాగంలో గాయత్రి బాయి(సాగర్), కే బ్యూల(వినుకొండ), బీ నేహాస్రీ(బ్రాహ్మణ కోడూరు), ఎం దీపిక భువన(సాగర్), అండర్-20 పురుషుల విభాగంలో కే లాలూనాయక్(రామనీపురం తండా), ఎన్ శ్రీకర్‌ప్రసాదు(గోరంట్ల), టీ సుమంత్(ఆవులవారిపాలెం), ఎస్ బాలకోటేశ్వరరావు(పిడుగురాళ్ళ), పీ విజయ్‌బాబు(ఖాజా), కే కిరణ్(చల్లగరిగ), డీ కుమార్‌బాబు(లగడపాడు), పి చంటి(బాలెమర్రు), కే భరత్‌కుమార్(రావిపాడు), బీ కళ్యాణ్(గొట్టిపాడు), కే ప్రభాకర్(ఓబులేసునిపల్లె), ఎం అఖిల్(పిడుగురాళ్ళ), అండర్-15 బాలికకల విభాగంలో ఎన్ లావణ్య, కే అనూష, బీ అలేఖ్య, ఎం పూజిత, ఏ పూజిత, ఎస్ మేరీవెన్నెల, డీ స్మృతి, జీ గాయత్రి(సాగర్), అండర్-15 బాలుర విభాగంలో పీ నాగచైతన్య, ఓ గౌరిప్రతాప్, ఏ ప్రణీత్, సీహెచ్ రాంబాబు(అచ్చంపేట), కే ఆదిత్య, వీ పవన్ కుమార్, కే అంకిత్‌రాజు(అడవితక్కెళ్ళపాడు), యూ ఆనంద్ భానుప్రసాదు(దుగ్గిరాల), పీ పునీత్(వరహాపురం)లు ఉన్నారు. ఎంపికైనవారు ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. పల్నాడు జిల్లా అసోసియేషన్ చైర్మన్ వై రమేష్‌బాబు ఈ పోటీలను ప్రారంభించారు.


రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యాచకులు, వృద్ధులకు వస్త్ర, అన్నదానం

మాచర్లటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా పట్టణంలో ఆదివారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన యాచకులు, వృద్ధులకు వస్త్ర, అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్‌ను ట్రస్ట్ ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ట్రస్ట్ పదో వార్షికోత్సవం జరిపారు. కార్యక్రమంలో వరల్డ్ బీయింగ్ ఫౌండేషన్ చైర్మన్ శాంతిబాయి, నాగూర్‌వలి, ఆవుల ఆంజనేయులు, హెచ్‌ఎం పాపిరెడ్డి, హరిబాబు, శ్రీనివాస్, నాగలక్ష్మి, నాగమణి, రామాంజినేయులు, మంగమ్మ, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాస్, చింతలపూడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన బట్టువారిపల్లె సర్పంచ్

కారంపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టువారిపల్లె సర్పంచ్ ఏరువ రమేష్‌బాబు (వైసీపీ) తన అనుయాయులతో జనసేన పార్టీలో చేరారు. గ్రామంలో ఆదివారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు సమక్షంలో జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరినవారిలో ఏరువ శ్రీరాములు, సత్యానందం, నలబోతుల వెంకటేష్, కూరపాటి పాపారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, ఉపాధ్యక్షుడు కామేపల్లి ఏడుకొండలు, ప్రధానకార్యదర్శి సంక సోమయ్య, షేక్ సైదావలి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రెంటచింతల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ఆదివారం రమణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయనాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, ట్రస్ట్ అధ్యక్షుడు నవులూరి శివారెడ్డి, షబ్బీర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక
టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి

కారంపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌మాసం మత సామరస్యానికి ప్రతీక అని.. ఇఫ్తార్ విందు ఆత్మీయతను పెంపొందిస్తుందని టీడీపీ యువనేత, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒప్పిచర్ల మసీదులోజరిగిన ఇఫ్తారు విందులో ఆయన వడ్డించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, కటికల బాలకృష్ణ, గాడిపర్తి పూర్ణయ్య, నీళ్లం జయ్య, పిన్నెల్లి అనంతరామయ్య, ఉన్నం హరిబాబు, కొండపల్లి చిన అప్పారావు, పంగలూరి హరిబాబు, లక్ష్మయ్య, చిరుమామిళ్ల శ్రీను, బొల్లినేని హరికృష్ణ, కిలారి పవన్, షేక్ జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవరంపాడు తిరునాళ్ల

రాజుపాలెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేవరంపాడు మత్స్యావతార శ్రీనేతివెంకన్నస్వామి తిరునాళ్ల చివరిరోజైన ఉగాది పండుగనాడు భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పొంగళ్లు చేసి స్వామివారికి సమర్పించారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కలసి ఉత్సవాలు జరుపుకోవటం హర్షణీయం


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామస్తులంతా కలసికట్టుగా వేంకటేశ్వర స్వామి కల్యాణం, తిరునాళ్ళ నిర్వహించుకోవటం హర్షణీయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం రాత్రి బెల్లంకొండ మండలం కందిపాడు గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం, తిరునాళ్ళకు ఆయన హాజరయ్యారు. ముందుగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అక్కల వెంకటరామిరెడ్డి, ఓర్సు ఆనంద్, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, హనుమంత రావునాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత చంద్రబాబుదే

ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బెల్లంకొండ మండలంలోని న్యూచిట్యాల గ్రామం పెదకూరపాడు నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 9నెలల పాలనలో నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచానన్నారు. బెల్లంకొండ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని మంత్రి, ఎంపీ నిధులతో అభివృద్ధి పరిచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బ్రహ్మారెడ్డి, మేళం శ్రీరామ్మూర్తి, మాజీ సర్పంచ్ హుస్సేన్, సర్పంచ్ జ్యోతి సముద్రం, ఎన్ పిచ్చయ్య, పీఎస్‌కే రసూల్, సయ్యద్ జానీ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ వద్ద ఆదివారం నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్‌టీఆర్ ఎస్టేట్ ఫేజ్-3 బ్రోచర్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, గోగినేని కోటేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, ఆళ్ల అమరేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

బెల్లంకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిపాడు గ్రామంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి పొంగళ్ళు పొంగించారు. ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్నదానం జరిగింది. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామంలో నిర్వహించిన బండ ఎత్తు పందెంలో కందిపాడు గ్రామానికి చెందిన ముద్దా నాగరాజు 16సార్లు బండ ఎత్తి రూ 5,116 మొదటి బహుమతి సాధించాడు. వల్లాల భవానీశంకర్, భాగం ఏడుకొండలు ఇరువురు 13 సార్లు బండ ఎత్తి రెండో బహుమతి రూ.4,116 సాధించారు. వందడపు సాయిరామ్ మూడో బహుమతి సాధించినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు తెల్లవారుజాము నుంచే బాబావారిని సందర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హారతులు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీగా అన్నదానం జరిగింది. సాయంత్రం పల్లకి సేవ, గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

క్రోసూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఉగాది సందర్భంగా ఆదివారం ఘనంగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రంజాన్ ప్రార్థనలకు ఈద్గా సిద్ధం

పిడుగురాళ్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యరపతినేనినగర్‌లో రంజాన్ ప్రార్థనలకు ఈద్గా ముస్తాబు చేశారు. 2018లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిర్మించిన ఈద్గా వద్ద సోమవారం ముస్లింల ప్రార్థనల కోసం భారీ ఏర్పాట్లను ఎమ్మెల్యే చేయించారు. సుమారు 10వేల మందికి సరిపడా భారీ టెంట్లు, అతిపెద్ద కూలర్లు, మంచినీటి వసతిని ఏర్పాటుచేశారు. ఉదయం 9.30 గంటలకు ఈద్గా వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే హాజరుకానున్నారు.

రంజాన్ శుభాకాంక్షలు...

పవిత్ర రంజాన్‌మాసంలో నియమనిష్టలతో ఉపవాసదీక్షలు పాటించి సోమవారం రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదరుల కుటుంబాలందరికీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలందరూ అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● పెదకూరపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా పెదకూరపాడు మండలంలోని మసీదులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పెదకూరపాడులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేసుకునేందుకు ఆయా మసీదుల పెద్దలు ఏర్పాట్లుచేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగను ముస్లింసోదరులు సంతోషంగా జరుపుకోవాలనిఆకాంక్షించారు.

● సత్తెనపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు వైవీ ఆంజనేయులు, యర్రం వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర నేతలు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, కనుమూరి బాజీచౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆడిట్ డిపార్ట్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ సుబ్బారావు

చలివేంద్రం ప్రారంభం

పెదకూరపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు ఎంతో అవసరమని.. ఏర్పాటుచేసిన నిర్వాహకులు అభినందనీయులని ఆడిట్ డిపార్ట్మెంట్ స్టేట్ డైరెక్టర్ కొర్లకుంట సుబ్బారావు అన్నారు. జన చైతన్యసమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులో కాలచక్ర ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తోట శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, పరుచూరి పూర్ణచంద్రరావు, సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల రామవరావు, విప్పర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా పిర్యాదుల కార్యక్రమం రద్దు

నరసరావుపేట రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేడు నిర్వహించాల్సిన ప్రజా పిర్యాదుల కార్యక్రమం రద్దయింది. రంజాన్ పర్వదినం సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు.

కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

నరసరావుపేట రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కోడిపందాలు నిర్వహిస్తున్న ఆరుగురి అరెస్టు

చిలకలూరిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి శివారులో ఆదివారం పొలాలలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ అధ్వర్యంలో దాడిచేసి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.4,700 నగదు, మూడు కోళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

హెచ్ఐవీ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35వ వార్డు పరిధిలోని సాంబశివనగర్‌లో హెచ్ఐవీ బాధితులకు ఆదివారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ క్రిస్టియన్ అసోసియేషన్ ఫర్ మెడికల్ మిషన్ అండ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం పింఛన్, ఉచిత మందులు, ఉచిత వైద్యసేవల్ని అందిస్తోందన్నారు. కేంద్రం కూడా బాధితులకు అండగా ఉంటోందన్నారు. నిత్యావసరాల పంపిణీకి ముందుకొచ్చిన సంస్థ నిర్వాహకులను ప్రత్తిపాటి అభినందించారు.

ఆలయ పునఃనిర్మాణం కోసం రూ.51,116 విరాళం

నరసరావుపేట రూరల్, మార్చి 30: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులుపుల వారి వీధిలోని వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ రాతి నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన చలువాది రామకృష్ణ, నాగమణి, వెంకట అయ్యప్ప పృథ్వీరాజ్‌గుప్తా, మౌనిక, నిర్విక గుప్తా దేవాలయాలనికి రూ.51,116 దేవస్థాన కమిటీకి అందజేశారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దాతలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దాతలకు స్వామివార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బుచ్చిపాపన్నపాలెంలో ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ

రొంపిచర్ల, మార్చి 30 (ఆంధ్రజోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జెండా పండుగ రోజు అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించటం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న యువ నాయకులు వడ్లమూడి వెంకటకిషోర్‌ను అభినందించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ది విఘ్నేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ

రొంపిచర్ల, మార్చి 30 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్లలోని వరసిద్ది విఘ్నేశ్వర స్వామికి ముత్తనపల్లి గ్రామానికి చెందిన గాడిపర్తి సురేష్ దంపతులు వెండి కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. వెండి కిరీటం విలువ సుమారు రూ.60వేలు విలువ ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు.

బిలాల్ మసీదులో ఇఫ్తార్

శావల్యాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శావల్యాపురంలోని బిలాల్ మసీదులో ముస్లింలకు వినుకొండకు చెందిన శ్రీనివాస నర్సింగ్ హోం అధినేత, సీనియర్ టీడీపీ నాయకులు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు ఆదివారం ఇఫ్తార్‌ను ఏర్పాటుచేశారు. మసీదులో మౌలానా షేక్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం వీరాంజనేయులు, టీడీపీ నాయకులు ముస్లింలకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం వీరాంజనేయులును ముస్లిం సోదరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరి పెదఅంజయ్య, బోడెపూడి వెంకటేశ్వర్లు, గుర్రం సుబ్బారావు, ప్రభుహుస్సేన్, మండల ఐటీడీపీ అధ్యక్షులు అన్నవరపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

వినుకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై క్రీస్తు ఆశీర్వాద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పాస్టర్ పత్రా ఫిలిప్, పత్రా లిడియా తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: ఫాస్టర్ పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతి క్రైస్తవులకు తీరని లోటు అని క్రైస్తవ పెద్దలు పేర్కొన్నారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం లూథరన్ చర్చి సమీపంలో ఫాస్టర్ ప్రవీణ్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రవీణ్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో లూథరన్ సంఘస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదాం

ఉగాది వేడుకల్లో జీవీ ఆంజనేయులు



పంచాంగ ప్రతులను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, ఆయన సతీమణి లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన, కూటమి నేతలు

వినుకొండ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. చీఫ్‌విప్ జీవీ కార్యాలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. 9 నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా చంద్రబాబునాయుడు పనిచేశారన్నారు. పట్టణ పురోహితులు డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, దేవుళ్లపల్లి చంద్రశేఖర్ శర్మ, శేషసాయిశర్మ చేతుల మీదుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి, కూటమి నేతలు పంచాంగం ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం వేదపండితులు జీవీ దంపతులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ నాయకులు మేడం రమేష్, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీనురాయల్ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ఆశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన

వినుకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొండమెట్ల వద్ద ఉన్న అతి పురాతనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి గో సంరక్షణ ఆశ్రమ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జాజుల మాల్యాద్రి, మోటమర్రు నరసింహారావు, కృష్ణ, పి.వి.సురేష్, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, ఉషా తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

నరసరావుపేట రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ఈ యేడాది అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. డాక్టర్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగారు పంచాంగ పఠనంచేశారు. అనంతరం తెలుగు పంచాంగం తెలుగు నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో ఎస్.మాధవి దేవి, భక్తులు, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. యడ్లపాడులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, శ్రీరణవీరాంజనేయస్వామి ఆలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి,



సాతులూరులో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

రామాలయాలలో, యడ్లపాడు మండల శ్రీరణవీరాంజనేయ సమాఖ్య ఆధ్వర్యంలో జగ్గాపురం గ్రామంలో పంచాంగకర్త పుసులూరి రంగాచార్యులు పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు వంకాయలపాటి ప్రేమకుమార్, ప్రధానకార్యదర్శి కాకుమాను హనుమంతరావు, సభ్యులు వైవీ రమేష్‌బాబు, వి.ఆనంద్‌కుమార్, ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన అన్నమయ్య సంకీర్తన సాయి బృందం వారు భక్తి గీతాలు ఆలపించారు. కాగా సాతులూరులో ఇటీవల పునఃప్రతిష్ఠ చేసిన రెడ్డిపేరంటాలమ్మ దేవాలయాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సందర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, దేవాలయ కమిటీ ఛైర్మన్ వి.వీరాంజనేయులు, కమిటీ సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, వెంకట సుబ్బారావు, ఐనవోలు రాధా, కమ్మ పెదశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్స పాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్ర కమిటీ కన్వీనర్ బత్తుల మురళి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇస్సా పాలెం మహంకాళి అమ్మవారికి విచ్చేసిన కోటప్పకొండ ప్రభల నిర్వాహకులకు సుమారు 50మందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఎన్ కాలేజీ అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కనుమూరి రాజ్యలక్ష్మి, మేడికొండ సత్యానందం బాబు తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్ల చెన్నకేశవ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్నాథ పీఠం, వీ అప్పాపురం, ఉప్పలపాడు, ములకలూరు, ఐనవోలు, మృత్యుంజాపురం తదితర గ్రామాల్లోని ప్రజలు ఉగాది పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పండితులు పంచాంగాన్ని పఠించారు.

● బొల్లాపల్లి: ఉగాది పండుగ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్లటూరు వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో ప్రసాదం, పండితుల పంచాంగ శ్రవణం, పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ వైభవ్ ప్రెసిడెంగ్ గజవల్లి వెంకట సుబ్బయ్య నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ అర్వపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కోట శ్రీనివాసరావు, కజ్జాయం లక్ష్మీనారాయణ, క్లబ్ సభ్యులు గుడిపాడు రామారావు, గజవల్లి చిన పేరయ్య, దేశు కోటేశ్వరరావు, కోట పట్టాభి రామారావు, కోట సుబ్బారావు, కోట రవి కుమార్, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలో ఉగాది పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పర్వదినం పురస్కరించుకొని మండలంలోని ముప్పాళ్ళలో షిర్డీ సాయిబాబా మందిరం, సాయికోటి వంద అడుగుల మహాస్థూపం 22వ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా వచ్చారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పునః ప్రారంభం



ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంనుప్రారంభిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8 వార్డులు, నియోజకవర్గంలోని 30 గ్రామాలకు తాగునీరు అందించే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పట్టణ శివారులోని తాగునీటి చెరువు పక్కన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం పునః ప్రారంభించారు. కాంటినెంటల్ కాఫీ సంస్థ రూ.15లక్షలు, కేఎంఈ వరప్రసాద్ రూ.10లక్షలను సీఎస్ఆర్ నిధులుగా కేటాయించినట్టు, పల్నాడు జిల్లాలో ఇంతటి భారీ తాగునీటి ప్లాంట్ ఎక్కడా లేదని ఈ సందర్భంగా పుల్లారావు చెప్పారు. ఈ తాగునీటి పథకం ఏర్పాటుకు ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి ఎంతో చొరవ చూపారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని అనుమతులతో రూ.4కోట్ల వ్యయంతో ప్రారంభించిన ఈ పథకాన్ని ఇక్కడి అవినీతి మంత్రి ప్లాంటును 5 ఏళ్ల పాటు మూసివేయించి, నిరుపయోగంగా మార్చారని విమర్శించారు. టీడీపీకి, చంద్రబాబుకు పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే ప్లాంటును మూసివేయించారని ప్రత్తిపాటి చెప్పారు. పాడైపోయిన బోర్ల స్థానంలో రూ.20 లక్షలతో కొత్తవి ఏర్పాటుచేసి ప్లాంట్ ను తిరిగి ప్రారంభించడానికి గతంలో ప్రయత్నించామని, అయితే వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులపై తప్పుడు ఎస్సీ, ఎస్టీ వేధింపు కేసులు పెట్టించి తమ ప్రయత్నాన్ని అడ్డుకుందన్నారు. ఈ పథకానికి తమ పార్టీ పేరు, నాయకుడి పేరుపెట్టి నడుపుకోవచ్చని గతంలో ఇక్కడి అవినీతి మంత్రి చెప్పడం జరిగిందన్నారు. ఎవరో ప్రారంభించిన పథకాలకు వారి పేర్లు పెట్టుకోవడానికి వారికి సిగ్గుకూడా లేదన్నారు. టీడీపీ నాయకులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలకు క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ



యువత ఉద్యోగావకాశాల కోసం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కూటమి నేతలు

వినుకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తరఫున విడుదల చేసిన పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌న్ను స్కాన్‌చేసి వివరాలు నమోదు చేసుకుంటే చాలు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక చీఫ్‌విప్ జీవీ కార్యాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను కూటమి నేతలతో విడుదల చేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కంపెనీ వివరాలతో పాటు ఏఏ ఉద్యోగాలు ఉన్నాయి, వాటి అర్హతలు ఏమిటి తదితర అంశాలు సెల్‌ఫోన్‌లోనే పొందుపరచడం జరిగిందని, 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 10వ తరగతి, ఆపై చదువుకున్న వారు ఎవరైనా ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగంలోని సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ, సీడాప్ ద్వారా ప్రభుత్వం దీనిని నిర్వహిస్తుందన్నారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు నమోదు చేసుకున్న యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్ల నుంచి సంస్థలను ఆహ్వానించి ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు అందించేవరకు అన్నీ ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. ఉగాది రోజున యువత కోసం ఇలా కొత్త అవకాశాలు అందించే క్యూఆర్ కోడ్ క్యాంపెయిన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ కూటమి నేతలు పాల్గొన్నారు.

కోలాహలంగా అడవి పేరంటాలమ్మ తిరునాళ్ళ



ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాలమ్మ తల్లి

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు బొందిలి పాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద తిరునాళ్ళ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆవరణలో మహిళలు పొంగళ్ళు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు తదితరులు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈవో సుధాకర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గరిమిడి శ్రీనివాసరావు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. పలు సత్రాలలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీనివాస నర్సింగ్ హోం అధినేత అన్నవరపు వీరాంజనేయులు ఏర్పాటుచేసిన పులిహోర పంపిణీ స్టాల్‌ను జడ్పీటీసీ పారా హైమావతి ప్రారంభించారు. సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున అధ్యక్షుడు కేవీఆర్ మోహన్‌చంద్ భక్తులకు తాగునీటి స్టాల్ ఏర్పాటు చేశారు. వినుకొండ రూరల్‌సీఐ ప్రభాకర్, ఎస్ఐ లోకేశ్వరరావులు తిరునాళ్ళలో బందోబస్తు ఏర్పాటుచేశారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది వసతులు పర్యవేక్షించారు. బొందిలిపాలెం 2, మతుకుమల్లి 2, పిచికలపాలెం 3, శావల్యాపురం-1 విద్యుత్ ప్రభలు నిర్మించి వాటిపై పాట కచేరీలు ఏర్పాటు చేశారు.



కళాకారులను సన్మానిస్తున్న గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ తదితరులు

కళాకారులకు ఘనంగా సత్కారం

వినుకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో నియోజకవర్గ కళాకారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి సాంస్కృతిక విభాగ నిధులు కళాకారులకు అందేలా చూడాలని, దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవాలయాల్లో కళాకారులకు అవకాశాలు కల్పించాలని, డీజే శబ్దంతో మితిమీరిన శబ్దకాలుష్యాన్ని నివారించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ పురస్కారాలు అందించి కళాకారులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమాజం కోసం శ్రమించే వివిధ వర్గాల వారిని సన్మానించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీపీఐ ఏరియా కార్యదర్శి మారుతివరప్రసాద్, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావుతో పాటు నియోజకవర్గంలోని కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న కేసానుపల్లి రైతులు

కేసానుపల్లి రైతులకు న్యాయం చేయాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు రైతుల వినతి

నరసరావుపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 167ఏ నేషనల్ హైవే కింద జొన్నగడ్డ రైతులకు ఇచ్చిన ధరనే కేసానుపల్లి రైతుల భూములకు వర్తింపచేసి న్యాయం చేయాలని రైతులు కోరారు. ఆదివారం కేసానుపల్లిలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 167ఏ నేషనల్ హైవేకి జొన్నగడ్డలో భూములకు రూ.కోటి 70 లక్షలుగా ఎకరానికి ప్యాకేజి ప్రకటించారని అన్నారు. పక్కనే ఉన్న కేసానుపల్లి భూములకు రూ.55 లక్షలుగా నిర్ణయించారన్నారు. కేసానుల్లి రెవెన్యూ భూముల సమీపంలో ఎల్‌టీనగర్, కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ఐ గ్రో స్కూల్, రెసిడెన్సియల్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయన్నారు. జొన్నగడ్డ భూముల ధరలనే కేసానుపల్లి భూమలకు వర్తింపజేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

సమాన ప్యాకేజీ వర్తింపజేయాలి: ప్రజా సంఘాల డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): 167ఏ నేషనల్ హైవేకి జొన్నగడ్డ రైతులకు ప్రకటించిన ప్యాకేజి కేసానుపల్లి, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడు రైతులకు వర్తింపజేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చీరాల ఓడరేవు- నకరికల్లు అడ్డరోడ్డు వరకు నూతనంగా ఏర్పాటు చేయబోయే రోడ్డుకు ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో గ్రామసభలో జొన్నలగడ్డ రైతులకి ఎకరానికి రూ.కోటి70 లక్షలు నిర్ణయించారన్నారు. మిగిలిన గ్రామాల రైతులకు ఆ ప్యాకేజి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామరావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శంకర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారు

వైభవంగా శంకరస్వామి తిరునాళ్ళ

రొంపిచర్ల, మార్చి 30 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామంలోని శంకరస్వామి తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. శంకరస్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్ళు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న శంకర స్వామిని, పార్వతీదేవి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. విఘ్నేశ్వర స్వామి, సాయి బాబా, మదన వేణుగోపాల స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా రెండు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.

తిరునాళ్ళపై పోలీసుల ఆంక్షలు

రొంపిచర్ల శంకరస్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం పోలీసులు ఆంక్షలు విధించారు. తిరునాళ్ళపై శనివారం సాయంత్రం గ్రామంలో చోటుచేసుకున్న ఘర్షణ నేపథ్యంలో వైసీపీ, టీడీపీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు. నర్సరావుపేట డీఎస్పీ నేతృత్వంలో పలువురు ఎస్ఐలు బందోబస్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. చెరువు కట్ట సెంటర్‌లోని రాజశేఖరరెడ్డి బొమ్మ వద్ద ప్రత్యేక పోలీసు పహారా ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. ప్రభలు ఏర్పాటు చేసే స్థలాన్ని కూడా పోలీసులు నిర్ణయించారు.



కనమర్లపూడిలో బీమా చెక్కును అందజేస్తున్న డైరెక్టర్ ఆంజనేయులు

పాలరైతు కుటుంబాలకు అండగా సంగం డెయిరీ

● డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు వివిధ రకాల బీమా పథకాలను ప్రవేశపెట్టి బాధిత కుటుంబాలను సంగం డెయిరీ ఎంతగానో ఆదుకుంటోందని వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు తెలిపారు. మండలంలోని కనమర్లపూడిలోని సంగం డెయిరీ ఎంపీఐ సెంటర్ అధ్యక్షుడైన మర్రి రాములు ఇటీవల సహజ మరణం చెందాడు. సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు సంగం డెయిరీలోని డీఆర్ఎఫ్ బీమా పథకం ద్వారా మృతుని భార్య కోటేశ్వరమ్మకు రూ.1,33,950 విలువైన చెక్కును సంగం డెయిరీ అధికారులు అందజేశారు. వినుకొండ సంగండెయిరీ మేనేజర్ మక్కెన జానకిరామయ్య మాట్లాడుతూ మృతుడు పాలఉత్పత్తిదారునిగా ఉన్నందున సంగం డెయిరీ వెల్ఫేర్ స్కీంద్వారా మట్టిఖర్చుల నిమిత్తం రూ.15వేలు, రూ.60వేలు విలువైన చెక్కును ఆయన కుటుంబసభ్యులకు అందజేశామన్నారు. సెంటర్ అధ్యక్షుడు మర్రి శ్రీనివాసరావు, కార్యదర్శి వీరాంజనేయులు, బీఎంసీసీ సెంటర్ అధ్యక్షుడు అల్లు వెంకటరాకేష్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, మర్రి నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు



చిలకలూరిపేట ఈద్గా వద్ద ట్యాంకర్లతో నీటిని తెచ్చి శుభ్రం చేస్తున్న సిబ్బంది

చిలకలూరిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగియడంతో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా సోమవారం పవిత్ర ప్రార్థనలు చేసేందుకు వీలుగా పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్లో ఉన్న ఈద్గా వద్ద మునిసిపాలిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి ఆ ప్రాంతమంతా శుభ్రం చేస్తున్నారు. అక్కడ ఉన్న చిన్న చిన్న బంకులు, ఇతరత్రా అడ్డాలను తొలగించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు పరిశీలించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, అంజుమన్ కమిటీ నాయకులు పరిశీలించారు.